ఇది ప్రజాస్వామ్యంపై దాడి



రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడే. ఇది అమానుషం. జగన్ తన బూటకపు ప్రసంగాలతో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. ఎవరిది అభివృద్ధి పాలనో.. ఎవరిది అనుద్దపాలనో ప్రజలకు తెలుసు.

- అమరనాథరెడ్డి, మాజీ మంత్రి



తిరుపతిలో జర్నలిస్టుల నిరసన ప్రదర్శన

ఇప్పుడు మీడియాపై పడ్డారు



జగన్ అధికారంలోకి రాగానే తొలుత టీడీపీ నేతలు, కార్యకర్తలను లక్ష్యం చేసుకున్నారు. దాడులు, దౌర్జన్యాలతో రెచ్చిపోయారు. ఇప్పుడు ప్రజాస్వామ్య పరిరక్షకులైన మీడియా ప్రతినిధులపై పడ్డారు. ఇలాగే మనం ఊరుకుంటే రేపు ఇళ్లల్లో దూరి కొడతారు. ఆస్తులను లాక్కుని మనల్ని బికారులను చేస్తారు. ప్రజలు మేలుకోవాలి. ప్రజాస్వామ్య పరిరక్షకులైన పాలకులను వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుని రాష్ట్రాన్ని ఆ దౌర్జన్యాలనుంచి రక్షించుకోవాలి. లేదంటే రాష్ట్రంలో జగనన్న రాజ్యాంగానికి బలి కావాల్సి వస్తుంది.

- కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ

రాక్షసరాజ్యం

ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై వైసీపీ మూకల దాడి పట్ల జిల్లావ్యాప్తంగా నిరసనలు

పాల్గొన్న జర్నలిస్టు, ప్రజా సంఘాలు... రాజకీయ పక్షాలు

తిరుపతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడు వద్ద ఆదివారం జరిగిన వైసీపీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై అధికార పార్టీ జరిపిన అమానుష దాడి పట్ల నిరసనలు వెల్లువెత్తాయి.దాడిని ఖండిస్తూ సోమవారం జిల్లావ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు, రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు సంయుక్తంగా పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. తిరుపతిలో వివిధ జర్నలిస్టు సంఘాలు ప్రెస్ క్లబ్ నుంచీ ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద గాంధీ విగ్రహం కూడలి వరకూ భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. సంఘీభావంగా టీడీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం,జనసేన, కాంగ్రెస్ పార్టీల నేతలు పాల్గొన్నారు.మహాత్ముడి విగ్రహం వద్ద ప్లకార్డులు, బ్యానర్లతో గంట పాటు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడిని ఖండిస్తూ, నిందితులను కఠినంగా శిక్షించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. టీడీపీ నుంచీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, సీనియర్ నేతలు ఊకా విజయ్‌కుమార్, ఆర్సీ మునికృష్ణ, ఊట్ల సురేంద్ర నాయుడు, జనసేన తిరుపతి నియోజకవర్గ ఇంఛార్జి కిరణ్ రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు పొనగంటి భాస్కర్, వరప్రసాద్, సీపీఎం నాయకుడు నాగరాజ, సీపీఐ నాయకుడు పెంచలయ్యలతో పాటు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, నరేంద్ర, మీడియా ఫోటోగ్రాఫర్ల సంఘం నాయకులు గిరిబాబు, రాధాకృష్ణ, జర్నలిస్టు ఫోరం నాయకుడు హరిబాబు, జర్నలిస్టు ఫెడరేషన్ నాయకులు గోపి, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

వామపక్షాల డిమాండు



కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ఆందోళన

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ మీద దాడి చేసిన వైసీపీ అల్లరి మూకలను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు.తిరుచానూరు సమీపంలోని కలెక్టరేట్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిరసన ప్రదర్శన నిర్వహించారు.మీడియా సిబ్బందిపై వైసీపీ దాడిచేయడం ఒక పిరికిపంద చర్య అన్నారు. రాష్ట్రంలో ఎంతటి అరాచక పాలన సాగుతోందో ఈ సంఘటన తేటతెల్లం చేసిందన్నారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వామపక్ష పార్టీల నాయకులు చిన్నం పెంచలయ్య, సాయిలక్ష్మి, జయచంద్ర, సుబ్రహ్మణ్యం, సుమన్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం

గూడూరులో కలెక్టర్‌కు వినతి పత్రం

గూడూరులో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ జరిగింది. పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ నుంచీ ముత్యాలపేట, రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా తిరిగి టవర్ క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించిన జర్నలిస్టులు అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం అక్కడే బైఠాయించి ధర్నా చేపట్టారు. అనంతరం అక్కడ నుంచీ ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం వద్ద కూడా ధర్నా చేపట్టి నిందితులను శిక్షించాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఆర్డీవో కార్యాలయంలో స్పందనకు హాజరైన కలెక్టర్ లక్ష్మీశాను కలసి జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. టీఎన్ఎస్ఎఫ్, జనసేన, బీజేవైఎం, వామపక్షాలు పాల్గొని జర్నలిస్టులకు మద్దతు ప్రకటించాయి.

జిల్లావ్యాప్తంగా జర్నలిస్టు సంఘాల నిరసనలు

చంద్రగిరిలో తహసిల్దారు కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించి డిప్యూటీ తహసిల్దారు అమృతకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు మద్దతుగా టీడీపీ, బీజేపీ, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో శరత్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కామేష్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, పలువురు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. రేణిగుంటలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించగా టీడీపీ, జనసేన, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. వెంకటగిరిలో ఉదయం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించగా సాయంత్రం టీడీపీ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి అక్కడ నుంచీ క్రాస్ రోడ్డు వరకూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇందులో మీడియా ప్రతినిధులతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. సూళ్ళూరుపేటలో గాంధీ విగ్రహం నుంచీ ఆర్టీసీ బస్టాండు, అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకూ జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. అయితే కార్యాలయంలో ఆర్డీవో అందుబాటులో లేకపోవడంతో తహసిల్దారు కార్యాలయం చేరుకుని అక్కడున్న ఆర్డీవో చంద్రమునికి వినతిపత్రం అందజేశారు.సత్యవేడులో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన అనంతరం అక్కడ నుంచీ జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని నినాదాలు చేస్తూ పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. స్టేషన్‌లో సిబ్బందికి వినతి పత్రం అందజేసి అక్కడ నుంచీ తహసిల్దారు కార్యాలయం చేరుకుని డీటీ రవిచంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. ప్రెస్ క్లబ్ నాయకులు రామచంద్రయ్య, త్యాగరాజు తదితరులతో పాటు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. వరదయ్యపాలెంలో పాత్రికేయులు ఆర్టీసీ బస్టాండు వద్ద ధర్నా చేపట్టి జర్నలిస్టులపై దాడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అక్కడి నుంచీ తహసిల్దారు కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టు నాయకులు నయీమ్, ఉమామహేష్‌లతో పాటు టీడీపీ నాయకుడు నిర్మల్ కుమార్, సీపీఐ నాయకుడు చిన్నరాజులు పాల్గొన్నారు.



చిన్నప్పటి నుంచే తిరుమలకు వస్తున్నా

హీరోయిన్ శ్రీలీల

తిరుమల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నప్పటి నుంచీ తరచూ తిరుమలకు వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం తనకు అలవాటని హీరోయిన్ శ్రీలీల చెప్పారు.సోమవారం ఉదయం ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అనంతరం ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ..కుటుంబ సమేతంగా శ్రీవారిని మరోమారు దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలుగుతో పాటు తనకు వివిధ భాషల్లో అవకాశాలొస్తున్నాయని,త్వరలో అన్ని వివరాలనూ ప్రకటిస్తానన్నారు. కాగా, ఆలయం ముందు శ్రీలీలను చూసేందుకు యాత్రికులు ఎగబడ్డారు.ఆమెతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

డిజిటల్ బోధన ఎలా వుంది?



గూడూరు, ఫిబ్రవరి 19 : గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి కలెక్టర్ లక్ష్మీశ హాజరై వినతులను స్వీకరించారు.జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలోని ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ను, పోలింగ్ కేంద్రాలను పరిశీలించాక డిజిటల్ క్లాస్‌లో విద్యా బోధనను ఆయన పరిశీలించారు.విద్యార్థులతో కలిసి వెనుక బెంచీలో కూర్చొని బోధనపై వారిని ఆరా తీశారు.

ఐఐటీ, ఐసర్ నేడు జాతికి అంకితం

ఏర్పేడు, ఫిబ్రవరి 19 : ఏర్పేడు వద్ద ఉన్న ఐఐటీ, ఐసర్‌లను కేంద్రప్రభుత్వం జాతికి అంకితం చేయనుంది. కేంద్రీయ విద్యాసంస్థలయిన భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థకు మేర్లపాక రెవెన్యూ పరిధిలో 560 ఎకరాలను, భారతీయ విజ్ఞాన శిక్షణ, మరియు పరిశోధన సంస్థకు జంగాలపల్లి రెవెన్యూ శ్రీనివాసపురం పంచాయతీలో 268 ఎకరాలను గత టీడీపీ ప్రభుత్వంలో కేటాయించిన విషయం తెలిసిందే.అప్పటినుంచీ జరుగుతున్న భవన నిర్మాణాలు ఇటీవల పూర్తయిన సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ సందర్భంగా తిరుపతి ఐఐటీలో ఏర్పాట్లు చేసినట్లు ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య తెలిపారు.

ఏసీబీ వలలో వీఆర్వో

కేవీబీపురం, ఫిబ్రవరి 19 : కేవీబీపురం మండలంలోని కోవనూరు వీఆర్వోగా పని చేస్తున్న మునిరాజ సోమవారం ఓ రైతు వద్ద రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ ఏఎస్పీ దైవప్రసాద్ కథనం మేరకు ..కల్లపూడి గ్రామానికి చెందిన శేఖర్ విద్యుత్ కనెక్షన్ నిమిత్తం వాల్టా సర్టిఫికెట్ కావాలంటూ సంవత్సర కాలంగా తిరుగుతున్నాడు.చివరకు వీఆర్వో మునిరాజ రూ.20వేలు డిమాండ్ చేయడంతో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు.వారిచ్చిన సమాచారంతో కేవీబీపురంలోని ఒక కూల్‌డ్రింక్ దుకాణంలో రైతు శేఖర్ నుంచి రూ.5వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.మునిరాజపై కేసు నమోదు చేశారు.డీఎస్పీ ప్రశాంతి, ఇన్‌స్పెక్టర్లు ఈశ్వర్, సునీల్ కుమార్, ఎల్‌వీ నాయుడు, ఎస్ఐ సూర్యనారాయణ తదితరులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.



లంచం డబ్బుతో పట్టుబడిన వీఆర్వో మునిరాజ

శ్రీకాళహస్తి పోలీసులకు హడల్

- నిద్రావస్థ నుంచి మేల్కొని పరుగులు పెడుతున్న అధికారులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: శ్రీకాళహస్తి మండల పరిధిలో పలు అక్రమాలపై ఎస్పీ మలిక గార్గ్ నేరుగా దృష్టిపెట్టారు. గొల్లపల్లి వద్ద పెద్దఎత్తున కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం సాయంత్రం ఎస్పీ పక్కా సమాచారం సేకరించారు. స్థానిక అధికారులకు విషయం పొక్కకుండా ఆర్ఎస్ఐ సుబ్బరాజుతో స్పెషల్ పార్టీ బృందాన్ని రంగంలోకి దింపారు. పది కోళ్లు, ఒక ద్విచక్ర వాహనంతో సహా ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఆదివారం రాత్రి శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.ఎస్పీ నేరుగా దృష్టి సారించిన విషయం తెలిసి పోలీసు అధికారులు సోమవారం వారి వారి పరిధిలో పరుగులు తీశారు. శ్రీకాళహస్తి మండలంలో పెద్దఎత్తున కోడి పందేలు జరుగుతున్నట్లు చాలాకాలంగా విమర్శలున్నాయి. ముఖ్యంగా కేపీ చింతల గ్రామంలో పెద్ద ఎత్తున నగదు చేతులు మారుతుందని ప్రచారం. అలాగే మరికొన్ని స్థావరాలపై కూడా ఎస్పీ దృష్టి పెట్టారు.శ్రీకాళహస్తి రూరల్‌లో స్పెషల్ పార్టీ బృందం దాడి చేయడంతో మిగతా అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం తొట్టంబేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో కోడిపందేల స్థావరంపై దాడులు చేశారు.

నేడు నారా భువనేశ్వరి కుప్పం రాక

- గుడుపల్లెలో మృతుల కుటుంబాలకు పరామర్శ

కుప్పం, ఫిబ్రవరి 19: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు ఎండీ నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' యాత్రకు మంగళవారం కుప్పం వస్తున్నారు. చంద్రబాబు జైలుకు వెళ్లినప్పుడు తట్టుకోలేక జిల్లాలో మరణించిన వారి కుటుంబాలను పరామర్శించనున్నారు. ఈమె పర్యటన వివరాలను సోమవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం కుప్పంలో మీడియాకు వివరించారు. గుడుపల్లె మండలం కొడతనపల్లె గ్రామంలో మృతుడు టి.వెంకటేశ్ కుటుంబాన్ని మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు పరామర్శిస్తారని పేర్కొన్నారు. 3 గంటలకు గుడుపల్లె ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌కు చేరుకుని అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తారన్నారు. అనంతరం మల్లప్ప కొండపై మల్లేశ్వరస్వామిని దర్శించుకుంటారన్నారు. సాయంత్రం 6.35 గంటలకు యామగానిపల్లెలో జి.వెంకటేశులు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెబుతారని వివరించారు. అనంతరం కుప్పం చేరుకుని హెబ్రోను చర్చిలో ప్రార్థనల్లో పాల్గొంటారన్నారు. అక్కడినుంచి చంద్రబాబు పీఏ మనోహర్ ఇంటికి వెళ్లి ఆయన్న పరామర్శిస్తారన్నారు. రాత్రి ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బస చేస్తారు. 'బుధవారం ఉదయం 10.10 గంటలకు శాంతిపురంలో మహిళలతో ముఖాముఖిలో నారా భువనేశ్వరి పాల్గొంటారు. 11.20 గంటలకు ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకుని అన్న క్యాంటీన్ ప్రారంభిస్తారు. అక్కడ్నుంచి రామకుప్పం చేరుకుని పోలీసు స్టేషన్ పక్కనే అన్న క్యాంటీన్ ప్రారంభిస్తారు. మధ్యాహ్న భోజనం తర్వాత పెద్దపంజాణి మండలానికి బయలుదేరి వెళతారు' అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22న పులిచెర్లలో పర్యటన

కల్లూరు: 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి ఈనెల 22న పులిచెర్ల మండలంలో పర్యటిస్తున్నట్లు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శిస్తారన్నారు. ఇలా 22న మధ్యాహ్నం 12 గంటలకు కమ్మపల్లికి చెందిన టీడీపీ వీరాభిమాని వెంకటపతి నాయుడు కుటుంబాన్ని.. ఒంటి గంటకు గడ్డంవారిపల్లి పంచాయతీ పగడాలవారిపల్లికి చెందిన టీడీపీ నేత దొరస్వామి కుటుంబసభ్యులను పరామర్శిస్తారన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్

ఆలస్యంగా నడిచిన పలు రైళ్లు



గూడ్స్ రైలు పునరుద్ధరణ పనులు

రేణిగుంట,ఫిబ్రవరి 19 : రేణిగుంట రైల్వే స్టేషన్ దక్షిణం వైపు యార్డులో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. చెన్నయ్‌లోని మేల్పాకం నుంచి కార్ల లోడ్‌తో అసోంలోని ఛాంగ్‌సరికెకు వెళుతున్న గూడ్స్ రైలు సోమవారం రాత్రి 9.15 గంటలకు పట్టాలు తప్పింది.రేణిగుంట స్టేషన్ లోని రోడ్డు నెంబరు సెవన్‌లోకి వెళుతున్న సమయంలో ఇంజన్ నుంచి మూడవ పెట్టె క్రాసింగ్ వద్ద పట్టాలు తప్పిందిగత ఏడాది కాలంలో ఇదే ప్రాంతంలో మూడుసార్లు ప్రమాదాలు జరగడం గమనార్హం. హుటాహుటిన యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్ సిబ్బంది అక్కడకు చేరుకొని పునరుద్ధరణ పనులు చేపట్టారు.సీడీవో ప్రణయ్‌కుమార్,ఐటీఎఫ్ సందీప్ కుమార్‌లతో పాటు పలువురు అధికారులు పనులను పర్యవేక్షించారు. ప్రధానరైలుమార్గంలో ప్రమాదం జరగడంతో చెన్నై నుంచి విశాఖ పట్టణం, ముంబాయి, తిరుపతి, భువనేశ్వర్‌లకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్ళు గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి.ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

మీడియాపై దాడి సిగ్గుచేటు

తిరుపతి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభలో సీఎం జగన్ మాట్లాడుతుండగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడాన్ని పలువురు ఖండించారు. ఇది మీడియాపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

ప్రజాస్వామ్యం సిగ్గుపడే రోజు



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడి ప్రజాస్వామ్యం సిగ్గుపడేరోజు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ దౌర్జన్యాలతో బెదిరించే ప్రయత్నం చేస్తున్న వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి. ఏపీని అరాచక ప్రదేశ్‌గా మార్చిన జగన్ రెడ్డి దౌర్జన్యాలను ప్రజలంతా గమనిస్తున్నారు.

- సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్యే, తిరుపతి

ఇది ప్రభుత్వం చేసిన దాడి



ఫొటో జర్నలిస్టుపై జరిగిన దాడి ప్రభుత్వం చేసిందిగా భావిస్తున్నాం. వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తున్న వ్యక్తిపై భౌతికదాడులు సరికాదు. వైసీపీ నాయకులు వైఖరి మార్చుకోవాలి. గతంలోనూ పలుమార్లు విలేకరులపై దాడులు జరిగాయి. పార్టీలకతీతంగా దాడులను ఖండించాలి. రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా రాక్షస పాలన కొనసాగుతోంది.

- రాంభూపాల్ రెడ్డి, కాంగ్రెస్ నేత

ప్రజాస్వామ్యానికి విలువలేదా?



ప్రజాస్వామ్యంలో ఉన్నామా? అరాచకపాలనలో ఉన్నామా? అన్న అనుమానం మీడియా ప్రతినిధులపై జరిగిన దాడి చూస్తుంటే కలుగుతోంది. ఈ విధానం మంచిది కాదు. సహనం నశించిపోతే ప్రజలు తిరగబడతారు. ఆ రోజు దగ్గరలో ఉంది. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాలి.

- ఊకా విజయకుమార్, టీడీపీ సీనియర్ నేత

దాడులతో భయపెడతారా?



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను హరిస్తూ దౌర్జన్యాలతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్న వైసీపీకి రోజులు సమీపించాయి. ఇలాంటి దాడులపై తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

- పొనగంటి భాస్కర్, బీజేపీ నేత

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

పాత్రికేయుల పట్ల వీధి రౌడీల్లా ప్రవర్తించడం సరికాదు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామ్యవాదులంతా దీన్ని ఖండించాలి. సీఎం ప్రసంగిస్తుండగా పోలీసులు చూస్తుండగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై పైశాచికంగా దాడిచేయడం దారుణం.

- నాగరాజు, సీపీఎం నేత

హేయమైన చర్య



పత్రికా స్వేచ్ఛను హరిస్తూ దౌర్జన్యాలతో బెదిరించే ప్రయత్నం చేయడం హేయమైన చర్య. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి. సీఎం ప్రసంగిస్తున్న సమయంలోనే జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

- పెంచలయ్య, సీపీఐ నేత

దాడుల సంస్కృతి సరికాదు



వీధి రౌడీల్లా దాడులకు దిగిన వైసీపీ మూకలను వెంటనే అరెస్టు చేయాలి. ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించే మీడియా గొంతు నొక్కడం సరికాదు. దాడుల సంస్కృతిని మానుకోవాలి. ప్రజాస్వామ్యవాదులందరూ గమనిస్తున్నారు.

- పుణ్యమూర్తి, అంబేడ్కర్ యువజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రజాస్వామ్యవాదులు కలిసి రావాలి

జర్నలిస్టులపై ఉన్మాదంగా చేస్తున్న దాడులను ఖండించేందుకు ప్రజాస్వామ్యవాదులందరూ కలిసిరావాలి. అల్లరిమూకలను ఉసిగొల్పి మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం ఏమిటి? ఇలాంటివి మానుకోకపోతే పత్రికా సమాజమే తిరిగి దాడులు చేయాల్సి ఉంటుంది. దాడి చేసిన వారిపై హత్యానేరంగా కేసు నమోదు చేయాలి.

- జర్నలిస్టు సంఘాల నాయకులు

షార్ ఉద్యోగి ఆత్మహత్య



జగన్నాథం (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19: సూళ్లూరుపేట పట్టణంలోని షార్ ఉద్యోగుల కాలనీ పులికాట్ నగర్‌లో విషాదం చోటు చేసుకొంది. షార్‌లోని ఎస్ఎంపీసీలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న జి.జగన్నాథం(38) తను నివాసం ఉంటున్న పులికాట్ నగర్ సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొంతకాలంగా ఆయన మానసిక పరిస్థితి బాగాలేదని, దీంతో ఆత్మహత్య చేసుకొన్నారని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరూ పిల్లలు ఉన్నారు.

ఫేస్‌బుక్ ప్రేమికులు.. ఒక్కటయ్యారు..!

పాలసముద్రం, ఫిబ్రవరి 19: ఫేస్‌బుక్ పరిచయం.. ప్రేమగా మారి ఒక్కటైందా జంట. పాలసముద్రం మండలం గంగమాంబాపురం గ్రామానికి చెందిన దీపిక (19)కి తల్లిదండ్రులు పెళ్లి నిశ్చయం చేశారు. మరో 10 రోజుల్లో పెళ్లి జరగాల్సివుంది. ఈ క్రమంలో ఫేస్‌బుక్ పరిచయంతో ప్రేమికుడిగా తిరుపతి జిల్లా తడ మండలం రామాపురం గ్రామానికి చెందిన విఘ్నేష్ వద్దకు ఈనెల 15న వెళ్లిపోయింది. మేజర్లయిన వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. తల్లిదండ్రులకు విషయం తెలియకపోవడంతో దీపిక కనిపించడం లేదని పాలసముద్రం పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు ఆ జంట ఆచూకీ తెలుసుకున్నారు. సోమవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ జానకిరామ్ ఇరువురు తల్లిదండ్రులతో మాట్లాడి, ఇద్దరూ మేజర్లు కావడంతో డీటీ మధుబాబు ఎదుట హాజరుపరిచారు. దీపిక తాను ప్రేమికుడి వెంటనే వెళతానని చెప్పడంతో తల్లిదండ్రులు మిన్నకుండి పోయారు.

జర్నలిస్టు ఇళ్ల స్థలాల దరఖాస్తుకు మరో వారం గడువు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: అర్హులై ఉండి వివిధ కారణాలతో ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోని జర్నలిస్టులకు మరో వారం రోజులు గడువు ఇచ్చినట్లు కలెక్టర్, డీఎంసీ చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈనెల 26వ తేదీ వరకు అర్హులైన జర్నలిస్టులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ అక్రెడిటేషన్ కలిగిన అర్హులైన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీం కింద ఇంటి స్థలాలను అందించేందుకు ఇప్పటికే జీవో 535 వచ్చిందని తెలిపారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

చంద్రగిరి, ఫిబ్రవరి 19: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఉమెన్ అసోసియేషన్(ఐప్వా) ఆధ్వర్యంలో చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా తిరుపతి నగర సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుంటే రెవెన్యూ అధికారులు స్థలాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ అమృతకు వినతిపత్రాన్ని అందజేశారు.ఐప్వా జిల్లా కన్వీనర్ సుజాత, మలార్, సతీష్, నాగేంద్రబాబు, నవీన్, రమేష్, శ్రీనివాసులు, హిమగిరి, బిందుమతి పాల్గొన్నారు.

చంద్రగిరి

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



పాకాల, ఫిబ్రవరి 19: దామలచెరువు పంచాయతీ పత్తిపాటివారిపల్లె సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలిశెట్టిపల్లెకు చెందిన పోకల వెంకటముని(82)తన ద్విచక్రవాహనానికి పత్తిపాటివారిపల్లె సమీపంలో ఓ బంక్‌లో పెట్రోలు నింపుకొని రోడ్డు క్రాస్ చేస్తుండగా బొలోరా వాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటముని తలకు తీవ్రగాయాలయ్యాయి. పీలేరు ఆసుపత్రికి తీసుకువెళ్లేలోపే ఆయన మృతిచెందాడు. పాకాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

21ఏ కింద భూములు రిజిస్ట్రేషన్ చేయించే బాధ్యత టీడీపీదే

- చంద్రగిరి టీడీపీ ఇన్‌ఛార్జి పులివర్తి నాని



తిరుచానూరు, ఫిబ్రవరి 19: చంద్రగిరి నియోజకవర్గంలో పెత్తందారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, శ్రామికుడైన పులివర్తి నానికి మధ్య యుద్ధం జరుగుతోందని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పులివర్తి నాని పేర్కొన్నారు.వచ్చే ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచేయడానికి జనం సిద్ధంగా ఉన్నారన్నారు. మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను సోమవారం తిరుచానూరు పంచాయతీలోని లక్ష్మీనగర్ కాలనీ, అంబేడ్కర్ నగర్‌లో నిర్వహించారు. మినీ మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై నానీ తదితరులు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులు, సర్పంచ్, ఆయన సోదరుడు తిరుచానూరు పంచాయతీలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా ఏకంగా ప్రైవేటు భూముల్లో దౌర్జన్యంగా ప్రవేశిస్తున్నారని మండిపడ్డారు. ఏళ్లతరబడి పక్కా గృహాలు నిర్మించుకున్న నివాసితులు పట్టాలు రెగ్యులరైజ్ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 21ఏ కింద భూములను రెగ్యులరైజ్ చేయిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారిని నియమిస్తామన్నారు. తిరుచానూరులో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఇసుక దోపిడీతో స్వర్ణముఖి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు. వీరి అక్రమాలు, అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు సీఆర్ రాజన్, ఈశ్వర్‌రెడ్డి, కిషోర్ రెడ్డి, సాల్మన్‌రాజ్, మునిరత్నంరెడ్డి, వాసు, హరేరామ్, సాయిరాయల్, రాజేంద్ర, మురళి, కలీం, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీ లక్ష్యంగా పనిచేద్దాం

టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు చిట్టిబాబు



చిట్టిబాబును సత్కరిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నియోజకవర్గం టీడీపీ కంచుకోట అని, రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీయే లక్ష్యంగా పనిచేద్దామని నియోజకవర్గ పరిశీలకుడు చిట్టిబాబు అన్నారు. తిరుపతి నియోజకవర్గ అబ్జర్వర్‌గా నియమితులైన ఆయన సోమవారం పార్టీ శ్రేణులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అందరూ సంఘటితంగా పోరాడి అరాచక ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు. తిరుపతి సీటును చంద్రబాబుకు కానుకగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్, నగర కమిటీ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, డివిజన్ ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

టీడీపీని విమర్శిస్తే ఊరుకోం



మీడియాతో మాట్లాడుతున్న బ్యాంకు శాంతమ్మ

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 19: పార్టీలో ఉండడం ఇష్టం లేకపోతే వెళ్లిపోవచ్చని, అంతేగాని పోతూపోతూ విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని టీడీపీ నగరాధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ హెచ్చరించారు. సోమవారం ఆమె ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుంచి మహిళలకు సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. అలాంటి పార్టీని విడిచిపెట్టి విమర్శలు చేయడం పద్ధతి కాదని మంజుల, లతరాయల్‌కు హితవుపలికారు. పార్టీ నుంచి వారిని ఇప్పటికే సస్పెన్షన్ చేసినట్లు ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో అనిత, నీలిమ, పార్వతి, హేమలత, మంగమ్మ, భారతి పాల్గొన్నారు.

దళితులకు జూపూడి క్షమాపణ చెప్పాలి

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 19 : రాజ్యాంగ సృష్టికర్త అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ వ్యాఖ్యలు చేసిన ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు దళితులకు క్షమాపణ చెప్పాలని జనసేన తిరుపతి నియోజకవర్గ నేతలు పార్థు, పవన్, నవీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండు ముందున్న అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. విదేశీ విద్యా దీవెన పథకానికి అంబేడ్కర్ పేరు తీసి సీఎం జగన్ పేరు పెడితే బాగుండని అనడం అంబేడ్కర్‌ను, దళితులను అవమానించడమేనని పేర్కొన్నారు.

ఈఎస్ఐ సేవలను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 19 : కార్మికుల ఆరోగ్యం కోసం ఈఎస్ఐ అమలు చేస్తున్న పథకాలను, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ శ్రీధర్ అన్నారు. ఈఎస్ఐ కార్పొరేషన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. ఈఎస్ఐలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్య భద్రతకు ఈఎస్ఐ ఎంతగానో కృషి చేస్తోందన్నారు. పథకాలపై ఈఎస్ఐ లబ్ధిదారులు అవగాహన కలిగి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నాటికలు, పాటల రూపంలో లబ్ధిదారులకు ఈఎస్ఐ సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో ఏవీఎస్ ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ అమ్ములు, సిబ్బంది విజయకుమారి, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూవివరాల నమోదులో అవకతవకలకు పాల్పడితే చర్యలు: కలెక్టర్



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గూడూరు, ఫిబ్రవరి 19: భూ వివరాల నమోదులో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించి పలువురి నుంచి వినతులు స్వీకరించారు. గూడూరు పట్టణానికి చెందిన మస్తానయ్య అనే దివ్యాంగుడు తనకు ట్రైసైకిల్, అంత్యోదయ రేషన్‌కార్డు ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ ట్రైసైకిల్‌ను తెప్పించి మస్తానయ్యకు అందజేశారు. అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో శిథిలావస్థకు చేరిన అంబేడ్కర్ భవనాన్ని అభివృద్ధి చేయాలని న్యాయవాది అరవ పార్వతయ్య వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా, తానే నేరుగా సమస్యలను విని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఇకపై జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఇక్కడ మొత్తం 134 అర్జీలు అందగా, భూ సమస్యలపై ఎక్కువగా వినతులు వచ్చాయన్నారు. అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటుగా నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలోని ఈవీఎం ఇంటర్మీడియేటరి స్ట్రాంగ్‌రూమ్, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అధికారులకు ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు, డబుల్ ఎంట్రీలను తొలగించాలని, ఫొటోలు స్పష్టంగా లేనివారివి సేకరించి అప్‌డేట్ చేయాలని సూచించారు. అనంతరం భవిత పాఠశాలను, డిజిటల్ క్లాస్‌లో విద్యా బోధనను తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులతో కలిసి వెనుక బెంచీలో కూర్చొని విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. బోధనా విధానం గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్‌కుమార్, డీఎల్‌డీవో వాణి, రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి, ఎస్ఐ మనోజ్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 84 ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 19 : తిరుపతి ప్రకాశం రోడ్డులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 84 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఫిర్యాదుదారులు హాజరై ఎస్పీ మలిక గర్గ్‌ను కలిసి తమ సమస్యలను తెలియజేసి, వినతులు అందజేశారు. వినతులను పరిశీలించిన ఎస్పీ ఆయా స్టేషన్లకు చెందిన అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

కనువిందు చేసిన కల్యాణ వేంకటేశ్వరుడు





తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 19 : గోవిందరాజస్వామి తెప్పోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి తెప్పలపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 8.30 గంటలకు ఆలయ మాడవీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం 9.45 నుంచి 10.30 గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. టీటీడీ హిందూ ధర్మప్రచారపరిషత్, అన్నమాచార్య ప్రాజక్టు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయరు స్వామి, ఆలయ ఏఈవో మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 19: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వేదాంతపురం సర్పంచ్ చెరుకుల జనార్దన్ యాదవ్ కోరారు. తిరుపతి రూరల్ మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ యశోద, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, ఎంపీడీవో రమేష్‌బాబు, పలుశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు మాట్లాడారు. ఈ సందర్భంగా వేదాంతపురం సర్పంచ్ మాట్లాడుతూ వేదాంతపురం సమీపంలోని ఆప్కాన్ దగ్గర ఉన్న నీటి సంపును మండలానికి అప్పగించాలని కోరారు. నగరపాలక సంస్థ - మండల అధికారులు సమన్వయం చేసుకొని నీటి సంపును వినియోగంలోకి తీసుకురావాలన్నారు.జడ్పీటీసీ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.కాగా సమావేశానికి తిరుపతి రూరల్, తిరుచానూరు పోలీసు అధికారులతో పాటు ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ, ఫారెస్ట్, ఎక్సైజ్ అధికారులు హాజరు కాలేదు.వారికి ఎంపీడీవో రమేష్‌బాబు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్టు సమాచారం.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 19: వచ్చే ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని ఓబీసీ స్టూడెంట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు సామాజిక న్యాయం పాటించాలన్నారు.తమిళనాడు తరహాలో రాష్ట్రంలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. నాయీ బ్రాహ్మణ, రజక, వడ్డెర, జంగమ వంటి ఎంబీసీ కులాలకు కూడా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలన్నారు. కురుబ, బోయ, గొల్ల, పద్మశాలి, గౌడ కులాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర యాదవ్, తిరుమలేష్, విక్రమ్, ప్రేమ్, పరసాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జిగా సంగీతం వెంకట్రామయ్య



చంద్రగిరి, ఫిబ్రవరి 19: ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జిగా పాకాల మండలం మద్దినాయనిపల్లెకు చెందిన సంగీతం వెంకట్రామయ్యను నియమించినట్లు రాష్ట్ర కార్యదర్శి వెంకటపతి మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్టీయూ అదనపు ప్రధాన కార్యదర్శిగా ధనంజయనాయుడు



ధనంజయనాయుడు, నాగేశ్వరరావు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి19: రాష్ట్రోపాధ్యాయ సంఘ(ఎస్టీయూ) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు కె.ధనంజయనాయుడు ఎన్నికయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులుగా రెండవ దఫా గాజుల నాగేశ్వరరావును ఎన్నుకోగా.. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమేష్‌బాబు, జగన్నాథం ఎన్నికైనట్లు ప్రకటించారు. వీరిని పలువురు టీచర్లు అభినందించారు.

హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ కట్టడాలను కూల్చేస్తాం!

కబ్జాదార్లకు మఠం ఫిట్ పర్సన్ హెచ్చరిక

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 19 : తిరుపతి హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ కట్టడాలను కొనసాగించినట్టయితే కూల్చివేస్తామని మఠం ఫిట్ పర్సన్ జి.రమేష్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెడతామని, మఠం భూములను విక్రయించి సామాన్యులను మోసగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని మఠం భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి ప్లాట్లుగా విక్రయించి అక్రమ దందా చేస్తున్నారని ప్రకటనలో పేర్కొన్నారు.మఠం భూమిని ఆక్రమించి ప్రహరీ గోడలు నిర్మిస్తుండగా ఈనెల 15వ తేదీన రెవిన్యూ అధికారుల సహాయంతో తొలగించడం జరిగిందని పేర్కొన్నారు. అయినా ఇంకా చాలామంది నిర్మిస్తున్నట్టు సమాచారం అందడంతో సోమవారం వాటిని అడ్డుకునేందుకు తిరుపతి రూరల్ తహసిల్దారు మహబూబ్ చాంద్, మఠం సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులురెడ్డి వెళ్ళగా ఆక్రమణదారులు వారిని చుట్టుముట్టి వాగ్వాదానికి దిగినట్టు వివరించారు. మఠం భూమిలో అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తే వాటిని కూల్చివేస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

ఉద్యోగాలకు సిద్ధార్థ విద్యార్థుల ఎంపిక



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 19: తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లిలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన టీవీఎస్ సుందరం ఫాస్టనర్స్ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. తమ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న 101మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. వీరికి వార్షిక వేతనం రూ. 2.26లక్షలు ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారిని ఛైర్మన్ వై.కొండారెడ్డి, సెక్రటరీ వై.ఆనందరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వై.విజయరెడ్డి, ప్లేస్మెంట్స్ డైరెక్టర్ పి.స్వామినాథ్, టీపీవో భాస్కర్, అధ్యాపకులు అభినందించారు.

శివజ్యోతి నగర్‌లో చోరీ

- 113 గ్రాముల బంగారు ఎత్తుకెళ్లిన దొంగలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 19: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి దొంగలు 113 గ్రాముల బంగారు నగలు ఎత్తుకెళ్లిన ఘటన శివజ్యోతి నగర్‌లో చోటుచేసుకుంది. ఆదివారం జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగుచూసింది. శివజ్యోతినగర్‌కు చెందిన ఎం.వినాయకం ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య పుట్టింటికిపోవడంతో ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఉదయం విధులకు వెళ్లే ఆయన రాత్రి తిరిగి వస్తుంటాడు. ఆదివారం రాత్రి ఆయన వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలకు వెళ్లిచూడగా బీరువా తెరిచి ఉండడమేగాక వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడంతో అలిపిరి పోలీసులకు సమాచారమిచ్చాడు. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించింది. 113 గ్రాముల బంగారు నగలు చోరీ అయ్యాయన్న బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దళితుల సమస్యలను పరిష్కరించండి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 19: జిల్లాలో దళితుల సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు ఎస్పీ మలిక గర్గ్‌ను కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌లో సోమవారం ఆమెను సంఘ నాయకులు కలిసి సన్మానించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సి.శివరాజు, నాయకుడు సి.మణి మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులు ప్రజలకు దక్కేలా చూడాలని కోరారు. జిల్లాలో దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలు, భూఆక్రమణలు, అవమానాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బి.బాలరాజు, రఘురామ్, రవికుమార్, సాయికుమార్ పాల్గొన్నారు.

అలరించిన గరికపాటి ప్రవచనం

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 19: అన్నమాచార్య కళామందిరంలో సోమవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నగరానికి చెందిన గరికపాటి ప్రసాద్ ప్రవచనం భక్తులకు ఆకట్టుకుంది. అష్టాదశపీఠాలలోని కామాక్షి అమ్మవారి వైభవాన్ని ఆయన రసవంతంగా వివరించారు. అనంతరం రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి ప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కేఎస్ రాజ, విశ్రాంత ప్రిన్సిపాల్ మిరియాల వెంకటరమణారెడ్డి, వెంకట్రామయ్య, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యా యాదవ్ తదితరులు ప్రవచనకర్తను అభినందించారు.

తహసీల్దారుకు సన్మానం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 19: ఆర్‌సీపురం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన ఉషారాణిని వైసీపీ నాయకులు సోమవారం సన్మానించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ ఢిల్లీరాణి, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు రఘునాథరెడ్డి, పుష్పకాంత్‌రెడ్డి, శేషాద్రి, చిట్టిబాబు, దేవరాజులునాయుడు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, టీడీపీ, బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

చంద్రగిరి, ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ రౌడీలను కఠినంగా శిక్షించాలని పలువురు జర్నలిస్టులు, ప్రతిపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయం ముందు జర్నలిస్టులు నిరసన తెలిపారు.టీడీపీ, బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నారు.టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, కొండూరు ప్రవీణ్, పులికంటి మోహన్ రెడ్డి, రాజులగారి వినోద్, బీజేపీ నాయకులు సుబ్రమణ్యం యాదవ్, వెంకటముని, నరేష్‌కుమార్ నాయుడు, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటపతి మాదిగ, వెంకట్రామయ్య, అంబేడ్కర్ ఆశయ పోరాట సమితి అధ్యక్షుడు బాదూరు ఎల్లయ్య, మాలమహానాడు ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గుంతాటి మురళి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

తిరుపతి

రూ.100 కోట్లతో అభివృద్ధి ప్రణాళిక అమలు

● పద్మావతి వర్సిటీ వీసీ భారతి



విలేకరులతో మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 19: రూ.100 కోట్ల పీఎం ఉష (ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్) నిధులతో యూనివర్సిటీలో ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తామని పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి పేర్కొన్నారు. సోమవారం వర్సిటీలో ఆమె మీడియాతో మాట్లాడుతూ బోధన, పరిశోధన రంగాల్లో ప్రమాణాలతో పాటు నాక్ ఏ ప్లస్ గుర్తింపు ఆధారంగా పీఎం ఉష ద్వారా వర్సిటీకి రూ.100 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో బోధన, పరిశోధన, వసతులు కల్పిస్తామని వివరించారు. ఇప్పటికే నిర్వహిస్తున్న ప్రాజెక్టులు, ఒప్పందాలు, పరిశోధనలు, తరగతుల్లో ప్రమాణాలను పెంపొందించి, భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఎడెక్స్ పథకం ద్వారా ఏర్పాటైన డిప్లొమో కోర్సులకు మూడువేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రిజిస్ట్రార్ రజని, పీఆర్వో శ్రీరజని పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



తోట సురేఖ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 19: బెంగళూరు రేవా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగ పరిశోధకురాలు తోట సురేఖ డాక్టరేట్ పొందారు. డిజైనింగ్ యాన్ ఇంటర్ ఆపరేబిలిటీ అండ్ ఐడెంటిటీ మేనేజ్‌మెంట్ ఫ్రేం వర్క్ వర్క్ ఫర్ బ్లాక్ చైన్ అంశంపై ప్రొఫెసర్ శంతాల దేవి పాటిల్ పర్యవేక్షణలో ఆమె సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. సురేఖ రూపొందించిన పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. పలు సదస్సుల్లో పాల్గొని పత్ర సమర్పణ చేశారని రేవా యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్యామరాజు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల కార్మికుల నూతన కార్యవర్గం



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 19: తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల కార్మికుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్.డి.రవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్షురాలిగా కె.చంద్రకళ, కార్యదర్శిగా కె.శారదమ్మ, ఉపాధ్యక్షులుగా ఎన్.జ్యోతి, భాగ్యమ్మ, అనురాధ, సహాయ కార్యదర్శులుగా రమాదేవి, వెంకట రమణమ్మ, జయమ్మ, కోశాధికారిగా డి.అమరావతి, సభ్యులుగా జీనత్, జయమ్మ, కుప్పమ్మ, హేమలత, కవిత, సుశీల, లోకేశ్వరి, నిర్మలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

సీబీఎస్‌లో భద్రత పెంచండి



ఎస్పీని అభినందిస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 19: సెంట్రల్ బస్టేషన్‌లో భద్రతను మరింత పెంచాలని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి సోమవారం ఎస్పీ మలికగర్గ్‌ను కోరారు. ఎస్పీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆయన మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. సీబీఎస్ నుంచి రోజూ లక్షమందిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారని తెలిపారు. సిబ్బంది కొరత కారణంగా చోరీలు పెరిగాయని, యాచకుల ముసుగులో అనామక వ్యక్తుల ఆగడాలు ఎక్కువయ్యాయని చెంగల్‌రెడ్డి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బస్టాండు లోపల ఆటోలు, ప్రైవేటు వాహనాల సంచారాన్ని నివారించాలని కోరారు. తగు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. డిప్యూటీ సీటీఎం భాస్కర్ పాల్గొన్నారు.

చార్టర్డ్ అకౌంటెంట్స్ తిరుపతి శాఖ అధ్యక్షుడిగా రవీంద్రరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న రవీంద్రరెడ్డి

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 19: అఖిల భారత చార్టర్డ్ అకౌంటెంట్ తిరుపతి శాఖ అధ్యక్షుడిగా జి.రవీంద్రరెడ్డి నియమితులయ్యారు. బాలాజీకాలనీలోని చార్టర్డ్ అకౌంటెంట్ తిరుపతి శాఖ కార్యాలయంలో సోమవారం నూతన కార్యవర్గం కొలువుదీరింది. ఉపాధ్యక్షులుగా బి.వి.మధుసూదన బాబు, కార్యదర్శిగా ఎం.సింహాద్రినాయుడు, కోశాధికారిగా బాలాజీ కామిశెట్టి నియమితులయ్యారు. పూర్వ అధ్యక్షులు సి.జగదీష్‌కృష్ణ, సి.నరసింహులు, ఎక్స్ అఫిషియో సభ్యుడు ఆర్.చెంగల్‌రెడ్డి నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

చీర్ల కిరణ్‌కు సన్మానం



కిరణ్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

తిరుపతి (కొర్లగుంట), ఫిబ్రవరి 19: సీపీఎస్ ఎంప్లాయీస్ సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నియమితులైన టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్ల కిరణ్ టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం పలువురు ఉద్యోగులు, స్నేహితులు సన్మానించారు. ఉద్యోగ సంఘం నాయకులు వంకీపురం పవన్, శ్రీహరి, శివ, పెరుమాల్, వెంకటసుబ్బయ్య, కేశవులు, హేమలత, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

బహుజనులకు సేవ చేయాలనుకుంటున్నా

● రిటైర్డ్ ఐపీఎస్ అధికారి పూర్ణచంద్రరావు



తిరుమల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారిగా వివిధ ప్రాంతాల్లో పనిచేసిన తాను ఇకపై బహుజనుల కోసం జీవితాన్ని అంకితం చేస్తానని తెలంగాణ విశ్రాంత ఐపీఎస్ అధికారి పూర్ణచంద్రరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన పూర్ణచంద్ర రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరుల్లో పనిచేశారు. తెలంగాణలో పోలీస్ నియామక బోర్డు చైర్మన్‌గా పని చేసి ఏసీబీ డీజీ హోదాలో రిటైరయ్యారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.కొత్త పార్టీ పెట్టే ఆలోచన లేదని, బహుజనుల కోసం సిద్ధంగా ఉన్న పార్టీలోనే చేరతానన్నారు. ఆలయాల్లో కుమ్మరులకు ఉన్న సంప్రదాయాలను పునరుద్ధరించాలని ఓ కుమ్మరి సామాజికవర్గానికి చెందిన వాడిగా ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. బహుజనుల్లో సంగీత కళాకారులకు అన్నమాచార్య కీర్తనలను ఆలపించడానికి అవకాశమివ్వాలని కోరారు. చాలామంది ఉద్యోగులు ఏసీబీ కేసుల్లో ఇరుక్కుని ఉన్నారని, వారికి సంబంధించి ప్రభుత్వ కమిటీ త్వరగా నిర్ణయం తీసుకుని కేసుల నుంచి ఉపశమనం కల్పించాలన్నారు.

మహిళా కాంగ్రెస్ చీఫ్ మొహిసినా బేగం



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 19: కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా తిరుపతికి చెందిన న్యాయవాది మొహిసినా బేగం నియమితులయ్యారు. ఆఫీస్ బేరర్లు, జిల్లా, సిటీ అధ్యక్షులను నియమిస్తూ ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబ సోమవారం ఉత్తర్వులు వెలువరించారు. ఆ మేరకు మొహిసినా బేగంను జిల్లా అధ్యక్షురాలిగా నియమించారు. అల్కాలాంబకు, ఏపీ అధ్యక్షురాలు తాంతియాకుమారి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతంకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తిరుపతికి చెందిన పప్పుతోరి సుభాషిణి, ఈశ్వరి సంయుక్త కార్యదర్శులుగా, పెనుకొండ వనజ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.96 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.96 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 70,338 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,741 మంది తలనీలాలు సమర్పించారు.

సిద్ధం సభకు వెళ్లిన శ్రీవారి బస్సులు మద్యపానంతో అపవిత్రం

● టీడీపీ నేతల ధ్వజం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి భక్తులు తిరుమలకు వెళ్లే బస్సులను అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు వినియోగించారని, వాటిలో మద్యపానం సేవించి, బిరియానీలు తిని అపవిత్రం చేశారని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ మండిపడ్డారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో పార్టీ నాయకులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రయాణికులను, శ్రీవారి భక్తులను ఇబ్బంది పెట్టి ఆర్టీసీ బస్సులను సిద్ధం సభకు తరలించారన్నారు. సభలో సీఎం జగన్ రెడ్డి మాట్లాడుతుండగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేయడం దారుణమన్నారు. సీఎంపై హత్యాయత్నం కేసు పెట్టాలని డిమాండు చేశారు. ఫ్యాన్ రెక్కలు విరిచేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్ల రూపాయల వరకు దారి మళ్లించారని ఆరోపించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నాయకులు శాంబోళ హరినాథ్, మనోహరాచారి, చెంగయ్య, గిరీష పాల్గొన్నారు.

రుయాలో చెదల నివారణకు నెలకు రూ.5 లక్షలట !



రుయాస్పత్రి పరిపాలన భవనం

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 19 : ఆస్పత్రి ఆవరణలో మహా అయితే చెత్తాచెదారం ఉంటుంది. కానీ చెదల నివారణ ఏజెన్సీ పేరుతో రూ.లక్షలు స్వాహా చేస్తున్న పరిస్థితి రుయాస్పత్రి, ఎస్వీ వైద్య కళాశాల, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి పరిధిలో నెలకొంది. ఈ ఆస్పత్రుల పరిధిలో చెదలు నివారణ చర్యలు చేపట్టేందుకు 2021 జూన్‌లో ఒక ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. ఆ ఏజెన్సీ తరఫున సబ్ కాంట్రాక్టు కింద బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్ కొంతకాలం ఆస్పత్రి పరిసరాల్లో అరకొర చెదల నివారణ చర్యలు చేపట్టారు. వచ్చే బిల్లుల్లో అధికారుల చేతులు తడపలేక తప్పుకున్నాడు. తర్వాత ఆ బాధ్యతలు ఎవరు నిర్వహిస్తున్నారనేది రహస్యంగానే ఉంది. అయినప్పటికీ చెదల నివారణ పేరుతో ఇప్పటికే రూ.1.60 కోట్లను అధికారులు బిల్లులు చేశారు. రుయాస్పత్రిలో కొందరు అధికారులు పారిశుధ్య ఏజెన్సీ బాధ్యతలు నిర్వహిస్తున్న కాంట్రాక్టరుతో కుమ్మక్కై చెదల నివారణ పేరుతో నెలకు రూ.5 లక్షలు వారి జేబుల్లో వేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా చెదలు నివారణ చర్యలు చేపట్టేందుకు నిబంధనల మేరకు ఐదుగురు కార్మికులు, ఇద్దరు సూపర్‌వైజర్లను నియమించాలి. పిచికారి చేసే రసాయనాలు, స్ప్రేలు కొనుగోలు చేయాలి. కానీ ఇక్కడ అవేమీ జరగడంలేదు. పారిశుధ్య కార్మికుల్లోని కొందరినే చెదలు నివారణ సిబ్బందిగా చూపుతూ నిధులు స్వాహా చేస్తున్నారు. మూడేళ్లుగా ఇదే తంతు కొనసాగుతున్నా పట్టించుకునే వారు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీ పేరుతోనే బిల్లులు చెల్లిస్తున్నాం

ఈ విషయమై రుయాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు మాట్లాడుతూ చెదల నివారణకు సంబంధించి మొదట్లో ఒప్పందం కుదుర్చుకున్న ఏజెన్సీ పేరుతోనే ఇప్పటికీ బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. సబ్ కాంట్రాక్టర్లు కొందరు మారినా బిల్లులు మాత్రం ఒప్పందం కుదుర్చుకున్న ఏజెన్సీకి చెల్లిస్తున్నామని తెలిపారు. ఏజెన్సీ తరఫున నలుగురు సిబ్బంది ఆస్పత్రిలో చెదలు నివారణ చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఏవైనా అవకతవకలు జరుగుతుంటే పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు.

సంస్కృత వర్సిటీలో జాతీయ సదస్సు



అతిథులకు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 19 : జాతీయ సంస్కృత వర్సిటీలో గణిత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండ్రోజుల జాతీయ స్థాయి హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ మ్యాథమేటికల్ టెక్నిక్స్ అండ్ కంప్యూటేషనల్ టూల్స్ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా వచ్చిన టీటీడీ డీఈవో డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్లూయిడ్ డైనమిక్స్ ప్రాథమిక భావనలు, మ్యాట్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్ ద్వారా సూత్రీకరణలు వివరించారు. గౌరవ అతిథులుగా హాజరైన ఐఐటీ ఖరగ్‌పూర్ గణితశాస్త్ర సీనియర్ ప్రొఫెసర్ పీవీఎస్ఎన్ మూర్తి, రాయలసీమ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ సుందరానంద్ ఫ్లూయిడ్ డైనమిక్ కాన్సెప్ట్‌లకు సంబంధించి నాన్-లీనియర్ డైనమిక్ సిస్టమ్స్, ఏఐ అండ్ ఎంఎల్‌లపై విశదీకరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమాశ్రీ, గణిత హెచ్‌వోడీ ప్రొఫెసర్ వి.రమేష్‌బాబు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ చందూలాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుపై ప్రజాసంఘాల పోరాటం

● కలెక్టరేట్ వద్ద ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు ● కలెక్టరేట్‌లో స్పందనకు 135 ఫిర్యాదులు





ఆందోళనకారులు లోనికి రాకుండా గేట్లు మూసివేసిన పోలీసులు - కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, వైసీపీ నేతల తీరుపై పలు ప్రజా సంఘాలు సోమవారం తిరుగుబాటు ప్రకటించాయి. వైసీపీ నేతల తీరును నిరసిస్తూ ప్రదర్శన చేపట్టాయి. కలెక్టరేట్‌లో చేపట్టిన స్పందన కార్యక్రమానికి 135 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా భూ సమస్యలపై 104 ఫిర్యాదులు అందాయి.



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో పెంచలకిషోర్

పాఠశాల స్థలాన్ని కాపాడండి

రేణిగుంట మండలం కరకంబాడి జడ్పీ ఉన్నత పాఠశాల మైదానాన్ని కాపాడాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. జిల్లా అధ్యక్షుడు అక్బర్, ప్రధాన కార్యదర్శి రవి మాట్లాడుతూ పాఠశాలకు కేటాయించిన 5 ఎకరాల్లో ఆటల కోసం కేటాయించిన స్థలం కబ్జాకు గురైందని తెలిపారు. హెచ్ఎంకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఉన్నతాధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్, హరిత, శివ, హర్షద, బాల, సుభాన్, అభి, రాజా, సుబ్బు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

చిట్టెచర్ల వాసులకు న్యాయం చేయండి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న చిట్టెచర్ల యానాది కుటుంబాలు

చిన్నగొట్టిగల్లు మండలం చిట్టెచర్ల యానాది కుటుంబాలకు న్యాయం చేయాలని కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి చలపతి మాట్లాడు తూ చిట్టెచర్ల పంచాయతీకి చెందిన 30 యానాది కుటుంబాలకు 1982లో ఇంటి స్థలాల కోసం కేటాయించిన స్థలాన్ని వైసీపీ నాయకులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాలని డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. కాశయ్య, బలరాం, నాగభూషణం, సావిత్రమ్మ, బుజ్జమ్మ, రాణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఇంటి పట్టాలు మంజూరు చేయాలి

ఇంటి పట్టాలు మంజూరు చేసిన నిరుపేదలకు స్థలం చూపించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. తిరుపతి అర్బన్, రూరల్ మండలాల్లో 35వేలకు పైగా ఇళ్ల పట్టాలు మంజూరు చేశారే తప్పా వారికి ఇల్లు కట్టించలేదన్నారు. తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం 612 సర్వే నెంబరులో ఉన్న 130 ఎకరాల ప్రభుత్వ భూమిలో స్థలాలు మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఈనెల 23న చంద్రగిరి ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, రాధాకృష్ణ, చిన్నం పెంచులయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, శివ, రవి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

తిరుపతి(లీగల్), ఫిబ్రవరి 19 : అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి రూ.5వేలు జరిమాన విధిస్తూ 4వ అదనపు మున్సిప్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. తిరుపతి నగర పరిధిలో వీరిని ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు.

వైసీపీ అక్రమాలపై విచారణ జరిపించండి



ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

వైసీపీ నేతల అక్రమాలు, ఆగడాలపై సమగ్ర విచారణ జరిపించాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు వందవాసి నాగరాజు, కందారపు మురళి, సుబ్రహ్మణ్యం, సీపీఐ నేతలు మురళి, విశ్వనాథ్ మాట్లాడుతూ రెండు రోజుల కిందట తిరుచానూరు సరస్వతినగర్‌లో పెరుమాల్ అనే వ్యక్తికి చెందిన భూముల్లో వైసీపీ నేత నరేష్ చొరబడి నిర్మాణాలు చేపట్టారన్నారు. తాము అడ్డుకోవడంతో నిర్మాణాలు ఆగాయని తెలిపారు. స్వర్ణముఖి నదిలో ఇసుక తరలించేస్తున్నారని పేర్కొన్నారు. వీటిపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయచంద్ర, సాయిలక్ష్మి, వేణుగోపాల్, సుమన్, శేషాద్రి, మునిశేఖర్, రవి, బాధితులు పెరుమాల్, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీకి చంద్రబాబును విమర్శించే అర్హత లేదు:టీడీపీ

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 19: రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సుపరిపాలన అందించిన మాజీ సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత వైసీపీ నేతలకు లేదని టీడీపీ బీసీ సెల్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలో సీఎం జగన్ తానేదో రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పాటుపడినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. సీఎం జగన్ ప్రసంగంలో ఆత్మస్తుతి, పరనింద తప్ప మరేదీలేదని ఎద్దేవా చేశారు. సీఎంగా ఉన్న సమయంలో చంద్రబాబు 130 సంక్షేమ పథకాలు అమలు చేస్తే వాటిని రద్దుచేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నిధులను మళ్లించి ఆ వర్గాలను దారుణంగా మోసం చేశారని తెలిపారు. నాయకులు రామయ్య, విశ్వనాథం, సత్తు మధుసూదన్‌యాదవ్, కరాటే చంద్ర, భక్తవత్సలం, ఆముదాల తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి : ఏపీటీఎఫ్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 19: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ అమలు చేసే వరకు 30శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ఇవ్వాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్(1938) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి కోరారు. టీపీపీఎం స్కూల్‌లో సోమవారం సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ధరల ఆధారంగా ద్రవ్యోల్బణానికి అనుగుణంగా 2023 జూలై 1నుంచి ఐఆర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కరువుభత్యం తరహాలో రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల డీఏ ఇవ్వాలని, నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, అడ్వాన్స్ సరెండర్ లీవులు, ఏపీజీఎల్ఐ మెడికల్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్లకు బకాయిపడ్డ రూ.22,500 కోట్లను వెంటనే మంజూరు చేయాలని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్కే బాబు, ఎస్.వెంకటముని, రాష్ట్ర కౌన్సిలర్ మోహన్‌దాస్, గౌరవాధ్యక్షుడు నాగూరయ్య, అదనపు కార్యదర్శి సురేష్, కార్యదర్శి కృష్ణప్రసాద్, ఆడిట్ సభ్యులు రవీంద్ర పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఒకరి మృతి



చంద్రశేఖర్ (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, ఫిబ్రవరి 19: చంద్రగిరి మండలం బి.కొంగరవారిపల్లె సమీపంలో ఓ అడవి పంది అకస్మాత్తుగా అడ్డురావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది.పోలీసుల కథనం మేరకు రేణిగుంట సమీపంలోని రామకృష్ణాపురానికి చెందిన చంద్రశేఖర్(55) దినపత్రికల కట్టను రేణిగుంట నుంచి చంద్రగిరి మండలం చిన్నరామాపురం వరకు వేస్తున్నాడు. సోమవారం ఉదయం యధావిధిగా ఆటోలో దినపత్రికలు తీసుకుని చిన్నరామాపురం వెళుతుండగా మార్గమధ్యంలోని బి.కొంగరవారిపల్లె సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా అడవి పంది దూరింది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

అభివృద్ధిని గాలికొదిలేసిన జగన్: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 19: ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేశారని, సంక్షేమం మాటున అవినీతి, అక్రమార్జనతో దోచుకుంటున్నారని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ అరాచకాలతో విసిగిపోయిన జనం రాబోవు ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోగా అప్పుల పాలు చేసి తీవ్ర సంక్షోభంలోకి నెట్టేశారని విమర్శించారు. సంక్షేమం అంటూ పది రూపాయలు చేతికి ఇచ్చి వంద లాగేస్తున్నాడని, అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సైతం పక్కదోవ పట్టించి పేదల వర్గాల అభ్యున్నతిని అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా రుణాలు మంజూరు చేయడమే కాకుండా కులవృత్తిదారులకు పనిముట్లు అందజేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ రౌడీ మూకల దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంచి కృష్ణయ్య, శోభన్‌నాయుడు, ప్రసాద్ నాయుడు, సాయికుమార్, కృష్ణమనాయుడు, వెంకటేశ్వర్లు, రాధానాయుడు, దార్ల రాజేంద్ర, వాసు, సుజాతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాయలమారి ప్రభుత్వాన్ని గద్దె దించాలి



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 19: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కందలి, చెమిర్తి గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. సీఎం సభలోనే మీడియా ప్రతినిధులపై దాడులు జరుగుతుంటే సామాన్యులకు రక్షణ ఎలా వుంటుందని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కోట్ల రూపాయల సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని తెలిపారు. చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని, రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, దుద్దా రాఘవరెడ్డి, మట్టం శ్రావణి, కృష్ణయ్య, శ్రీనివాసులురెడ్డి, సురేంద్ర, వెంకటేశ్వర్లు, సురేష్, రత్నం, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో చంద్రముని అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో విధుల్లో నిర్లక్ష్యం తగదని, అన్ని గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పక్క ప్రణాళికతో పనిచేయాలని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని, ఎటువంటి లోటుపాట్లు ఉండకూదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, డీటీ చైతన్య, ఎన్నికల డీటీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఒకరి మృతి



చంద్రశేఖర్ (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, ఫిబ్రవరి 19: చంద్రగిరి మండలం బి.కొంగరవారిపల్లె సమీపంలో అడవి పంది అకస్మాత్తుగా దారికి అడ్డంగా రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు రేణిగుంట సమీపంలోని రామకృష్ణాపురానికి చెందిన చంద్రశేఖర్(55) దినపత్రికల కట్టను రేణిగుంట నుంచి చంద్రగిరి మండలం చిన్నరామాపురం వరకు వేస్తున్నాడు. సోమవారం ఉదయం యధావిధిగా ఆటోలో దినపత్రికలు తీసుకుని చిన్నరామాపురం వెళుతుండగా మార్గమధ్యలోని బి.కొంగరవారిపల్లె సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా అడవి పంది దూరింది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో ఆటో నడుపుతున్న చంద్రశేఖర్ అక్కడిక్కడే మృతి చెందాడు. చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

షార్ ఉద్యోగి ఆత్మహత్య



జగన్నాథం (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19: సూళ్లూరుపేట పట్టణంలోని షార్ ఉద్యోగుల కాలనీ పులికాట్ నగర్‌లో విషాదం చోటు చేసుకొంది. షార్‌లోని ఎస్ఎంపీసీలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న జి.జగన్నాధం(38) తను నివాసం ఉంటున్న పులికాట్ నగర్ సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొంతకాలంగా ఆయన మానసిక పరిస్థితి బాగాలేదని, దీంతో ఆత్మహత్య చేసుకొన్నారని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరూ పిల్లలు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న లగేజీ ఆటో

ఒకరి మృతి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 19: పట్టణంలోని తుమ్మూరు సమీపంలో మోటారు సైకిల్‌ను లగేజీ ఆటో ఢీకొన్న సంఘటనలో అంకయ్య(41) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ఓజిలి మండలం నగుటూరుకు చెందిన అంకయ్య నాయుడుపేట పట్టణంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం తన స్వగ్రామానికి మోటారు సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా తుమ్మూరు సమీపంలో ఎదురుగా వస్తున్న లగేజీ ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంకయ్యను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు

ఒకరికి గాయాలు

డక్కిలి, ఫిబ్రవరి 19: స్కూటర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు కథనం మేరకు... రాపూరు మండలం చెల్లటూరుకు చెందిన బక్కా సుధాకర్ డక్కిలిలో బేల్దారి పనులు ముగించుకొని స్కూటరుపై ఇంటికి బయలుదేరాడు. డక్కిలి ప్రభుత్వాస్పత్రి వద్ద వెళ్తుండగా కారు ఢీకొంది. సుధాకర్ తలపై బలమైన రక్త గాయం కావడంతో స్థానికులు పక్కనే వున్న ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా వుండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. కారు డ్రైవరు సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

చర్చిలో చోరీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19: మండల పరిధిలోని సామంతమల్లాం చర్చిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. చర్చి తాళం పగళగొట్టి లోపల ఉన్న యాంప్లీప్లేయర్, సౌండ్ సిస్టం పరికరాలతో పాటు కానుకల గల్లా పెట్టెను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి పాస్టర్ సుధీర్ కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.





గూడూరులో టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మీడియా ప్రతినిధుల ర్యాలీ - వెంకటగిరిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల

మీడియా ప్రతినిధులకు రక్షణ కరువు

గూడూరు, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో మీడియా ప్రతినిధులకు రక్షణ కరువైందని, ప్రజాస్వామ్యంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న విలేకరుపై దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని జర్నలిస్టు సంఘాల నేతలు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడాన్ని నిరసిస్తూ సోమవారం గూడూరులో మీడియా ప్రతినిధులు నిరసన తెలిపారు. పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ నుంచి ముత్యాలపేట, రైల్వేస్టేషన్ రోడ్లు మీదుగా ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ధర్నా చేపట్టారు. వీరి నిరసనకు టీఎస్ఎస్ఎఫ్, జనసేన, బీజేవైఎం, వామపక్ష నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న విలేకరులపై దాడులకు పాల్పడడం మంచి పద్ధతికాదన్నారు. దెందులూరు, రాప్తాడు సభల్లో విలేకరులపై వైసీపీ నాయకులు దాడులు చేసినా ప్రభుత్వ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. ఈ తరహా దాడులు పునావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. అనంతరం టవర్‌క్లాక్ సెంటర్ నుంచి ప్రదర్శనగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. స్పందన కార్యక్రమంలో పాల్గొనేందుకు గూడూరుకు వచ్చిన కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, టీఎన్ఎస్ఎఫ్, జనసేన, బీజేవైఎం, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

వెంకటగిరి: రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందని, ప్రజలకు, మీడియాకు రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు చేసిన దాడికి నిరసనగా వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో రాజ్యాంగాన్ని కాపాడాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు, శ్రీరాందాస్ గంగాధర్, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, కొండ్లపూడి రాఘవరెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, తాండవ చంద్రారెడ్డి, నరసింహులు, కొల్లాపూరు సుధ, చంగారావు, జానసాటి బాలకృష్ణ, రాపూరు శ్రీనివాసులు, హేమంత్ చౌదరి, సుకుమార్, నానీ, చంటీ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే మీడియా ప్రతినిధులపై దాడిచేయడం అమానుషమని ఏపీడబ్ల్యూజే యూనియన్ నాయకులు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడాన్ని నిరసిస్తూ స్థానిక గ్రంథాలయం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తడ: సూళ్లూరుపేటలోని గాంధీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద ఏపీయూడబ్ల్యూజే, జర్నలిస్టు సంఘాలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపాయి. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడులకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీయుడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై విక్షిక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరచిన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. అక్కడ నుంచి ఆర్డీవో ఆఫీసు మీదుగా తహసీల్దారు కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో చంద్రమునికి, తహసీల్దారు గోపాలకృష్ణకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడు కిరణ్, జర్నలిస్టులు దేవేంద్ర రెడ్డి, వేణుగోపాల్, మొలకల రమణయ్య, రమేష్, గల్లా శ్రీనివాసరావు, సునీల్, భాస్కర్, మూర్తి, జోసఫ్, గజేంద్ర, సురేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: రాష్ట్రంలో మీడియా ప్రతినిధులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ఏపీజేయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకుమాను వెంకటవేణు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి శేఖర్‌బాబు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని వారు ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాని కోరారు.

పెళ్లకూరు: రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు హేయమైన చర్య అని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి అన్నారు. మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.





సూళ్లూరుపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టుల నిరసన - వెంకటగిరిలో గాంధీజీ వినతిపత్రం ఇస్తున్న మీడియా ప్రతినిధులు

భూవివరాల నమోదులో అవకతవకలకు పాల్పడితే చర్యలు: కలెక్టర్



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గూడూరు, ఫిబ్రవరి 19: భూ వివరాల నమోదులో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించి పలువురి నుంచి వినతులు స్వీకరించారు. గూడూరు పట్టణానికి చెందిన మస్తానయ్య అనే దివ్యాంగుడు తనకు ట్రైసైకిల్, అంత్యోదయ రేషన్‌కార్డు ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ ట్రైసైకిల్‌ను తెప్పించి మస్తానయ్యకు అందజేశారు. అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో శిథిలావస్థకు చేరిన అంబేడ్కర్ భవనాన్ని అభివృద్ధి చేయాలని న్యాయవాది అరవ పార్వతయ్య వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా, తానే నేరుగా సమస్యలను విని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఇకపై జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఇక్కడ మొత్తం 134 అర్జీలు అందగా, భూ సమస్యలపై ఎక్కువగా వినతులు వచ్చాయన్నారు. అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటుగా నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలోని ఈవీఎం ఇంటర్మీడియేటరి స్ట్రాంగ్‌రూమ్, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అధికారులకు ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు, డబుల్ ఎంట్రీలను తొలగించాలని, ఫొటోలు స్పష్టంగా లేనివారివి సేకరించి అప్‌డేట్ చేయాలని సూచించారు. అనంతరం భవిత పాఠశాలను, డిజిటల్ క్లాస్‌లో విద్యా బోధనను తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులతో కలిసి వెనుక బెంచీలో కూర్చొని విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. బోధనా విధానం గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్‌కుమార్, డీఎల్‌డీవో వాణి, రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి, ఎస్ఐ మనోజ్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్టీయూ అదనపు ప్రధాన కార్యదర్శిగా ధనంజయనాయుడు



తిరుపతి(విద్య), ఫిబ్రవరి19: రాష్ట్రోపాధ్యాయ సంఘ(ఎస్టీయూ) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు కె.ధనంజయనాయుడు ఎన్నికయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులుగా రెండవ దఫా గాజుల నాగేశ్వరరావును ఎన్నుకోగా.. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమేష్‌బాబు, జగన్నాథం ఎన్నికైనట్లు ప్రకటించారు.

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఐక్యవేదిక సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 19: రానున్న ఎన్నికల్లో ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ పేపర్ల ద్వారా పోలింగ్ నిర్వహించాలని భారత లౌకిక రాజ్యాంగ పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లపై సందేహాలు ఉన్నాయన్నారు. ఈవీఎంలలో ఓటర్ల తీర్పును తారుమారు చేసే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

సంస్కృత వర్సిటీలో జాతీయ సదస్సు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 19: జాతీయ సంస్కృత వర్సిటీలో గణిత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండ్రోజుల జాతీయ స్థాయి హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ మ్యాథమేటికల్ టెక్నిక్స్ అండ్ కంప్యూటేషనల్ టూల్స్ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా వచ్చిన టీటీడీ డీఈవో డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్లూయిడ్ డైనమిక్స్ ప్రాథమిక భావనలు, మ్యాట్‌ల్యాబ్ సాఫ్ట్‌వేర్ ద్వారా సూత్రీకరణలు వివరించారు. గౌరవ అతిథులుగా హాజరైన ఐఐటీ ఖరగ్‌పూర్ గణితశాస్త్ర సీనియర్ ప్రొఫెసర్ పీఎస్ఎన్ మూర్తి, రాయలసీమ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ సుందరానంద్ మాట్లాడుతూ ఫ్లూయిడ్ డైనమిక్ కాన్సెప్ట్‌లకు సంబంధించి నాన్-లీనియర్ డైనమిక్ సిస్టమ్స్, ఏఐ అండ్ ఎంఎల్‌లపై విశదీకరించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు



టీడీపీలో చేరిన వారితో డాక్టర్ హెలెన్

నారాయణవనం, ఫిబ్రవరి 19: చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీని లభిస్తుందని సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ అన్నారు. సోమవారం నారాయణవనం మండలం బ్రాహ్మణతాంగల్ గ్రామంలో టీడీపీ మండలాధ్యక్షుడు గిరి బాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మినీమేనిఫెస్టో గురించి వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలు టీడీపీలో చేరడంతో వారికి డాక్టర్ హెలిన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మునస్వామి యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి షణ్ముగం, నాయకులు కేఎస్.రవి, పొన్నుస్వామి, మునివేలు, మారిముత్తు, మహేంద్ర, కన్నన్‌దాసు, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు లత తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

కార్మిక యూనియన్ నేత మృతి



పాండురంగయ్య (ఫైల్‌ఫొటో)

పుత్తూరు, ఫిబ్రవరి 19: పుత్తూరు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో జేఏవోగా పనిచేస్తున్న పాండురంగయ్య(46) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. కార్మిక యూనియన్ 1104 తిరుపతి ప్రాంతీయ అధ్యక్షుడిగా, పుత్తూరు డివిజన్ అధ్యక్షుడిగా ఆయన పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు వున్నారు. పాండురంగయ్య మృతి పట్ల కార్మికులు సంతాపం తెలిపారు.

టీడీపీలో చేరిక

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 19: మండల పరిధిలోని పరమేశ్వరమంగళం గ్రామానికి చెందిన దాసరి విజయ్‌చౌదరి, దాసరి అజయ్‌చౌదరి సోమవారం నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారి వెంట నాయకులు చార్లస్, సోమశేఖర్, రాజేష్, జయచంద్రుడు, హను తదితరులు ఉన్నారు.

చేసింది ఏమీ లేకనే... వెకిలి మాటలు: భానుప్రకాష్



మీడియాతో మాట్లాడుతున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 19: రాయలసీమ అభివృద్ధికి తన ఐదేళ్ల పాలనలో చేసిందేమీ లేకే అనంతపురం జిల్లా, రాప్తాడులో సీఎం జగన్ వెకిలి మాటలతో ప్రతిపక్షాలపై అసత్య ఆరోపణలు చేశారని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులకు ఈ ఐదేళ్లలో ఎంత నిధులు ఖర్చు చేశారు... పనుల పురోగతి, ప్రస్తుత పరిస్థితిపై ప్రజలకు ఎందుకు వివరించలేదని నిలదీశారు. సొంత జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి పదుల సంఖ్యలో జనం సజీవ సమాధి కాగా ఇప్పటి వరకు పట్టించుకున్న పాపాన పోలేదని దుయ్య బట్టారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏమైంది.. కర్నూలులో మెగా సీడ్ పార్కు, పదివేల మందికి ఉపాధి కల్పించే అమర్‌రాజ ఫ్యాక్టరీ, జాకీ కంపెనీ రాష్ట్రం నుంచి ఎందుకు వెళ్లిపోయింది... హంద్రీ నీవా, గాలేరు నగరి ప్రాజెక్టు దుస్థితిపై ప్రజలకు సమాధానం ఎందుకు చెప్పలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వీటన్నింటిపై మాట్లాడకుండా ఇంట్లో, బయట, సింకులో అంటూ ఎకసెక్కాలు మాట్లాడడం ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చడమేనని అన్నారు. సిద్ధం పేరుతో ప్రజలపై యుద్ధం ప్రకటించినట్లు ఉందని మండిపడ్డారు. ఉన్న పథకాలకే పేర్లు మార్చి సంక్షేమాన్ని తానే తొలిసారి అందిస్తున్నాననే బిల్డప్ ఇస్తున్నాడని సీఎం జగన్‌పై విరుచుకుపడ్డారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయమైన చర్య

సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి హేయమైన చర్యగా భానుప్రకాష్ అభివర్ణించారు. ఈ దురదృష్టకర సంఘటన వైసీపీ నాయకుల నైజాన్ని తెలియజేస్తోందన్నారు. రేపు ప్రభుత్వం మారితే వైసీపీ నాయకులు, సాక్షి విలేకరుల పరిస్థితి ఏమిటనేది గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. పోలీసులు వెంటనే దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పోలీసు వ్యవస్థపైన ప్రజలు విశ్వాసం కోల్పోయారని, బాధితులపైనే కేసులు పెట్టడం, వారిని వేధించడం ఇకనుంచైనా మానుకోవాలని సూచించారు. లేకుంటే శాంతిభద్రతలు పోలీసుల చేతుల్లో ఉండదనే విషయం తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించండి: సీపీఎం



పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 19: మండల పరిధిలోని తడుకు పంచాయతీ రంగుంట ఎస్టీ కాలనీకి శ్మశాన స్థలాన్ని కేటా యించాలని సీపీఎం నాయకుడు వెంకటేష్, దళిత నేత నందయ్య సోమవారం పుత్తూరు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సర్వే నెంబర్ 272లో భూమిని రంగుంట ఎస్టీ కాలనీవాసులు శ్మశాన స్థలంగా వాడుకుంటున్నారని, అయితే స్థానిక రైతులు అడ్డుకోవడం తగదన్నారు. రంగుంట ఎస్టీ కాలనీవాసులకు శ్మశాన స్థలాన్ని చూపించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు.

తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఫేస్‌బుక్ ప్రేమికులు.. ఒక్కటయ్యారు..!



ప్రేమికులతో మాట్లాడుతున్న డీటీ

పాలసముద్రం, ఫిబ్రవరి 19: ఫేస్‌బుక్ పరిచయం.. ప్రేమగా మారి ఒకటైందా జంట. పాలసముద్రం మండలం గంగమాంబాపురం గ్రామానికి చెందిన దీపిక (19)కి తల్లిదండ్రులు పెళ్లి నిశ్చయం చేశారు. మరో 10 రోజుల్లో పెళ్లి జరగాల్సివుంది. ఈ క్రమంలో ఫేస్‌బుక్ పరిచయంతో ప్రేమికుడిగా తిరుపతి జిల్లా తడ మండలం రామాపురం గ్రామానికి చెందిన విఘ్నేష్ వద్దకు ఈనెల 15న వెళ్లిపోయింది. మేజర్లయిన వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. తల్లిదండ్రులకు విషయం తెలియకపోవడంతో దీపిక కనిపించడం లేదని పాలసముద్రం పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు ఆ జంట ఆచూకీ తెలుసుకున్నారు. సోమవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ జానకిరామ్ ఇరువురు తల్లిదండ్రులతో మాట్లాడి, ఇద్దరూ మేజర్లు కావడంతో డీటీ మధుబాబు ఎదుట హాజరుపరిచారు. దీపిక తాను ప్రేమికుడి వెంటనే వెళతానని చెప్పడంతో తల్లిదండ్రులు మిన్నకుండి పోయారు.

కనక దుర్గమ్మకు ముక్కంటి పట్టువస్త్రాలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: విజయవాడలో వెలసిన కనక దుర్గమ్మకు శ్రీకాళ హస్తీశ్వర ఆలయం తరఫున పట్టు వస్త్రాలను సమర్పించారు. కనక దుర్గమ్మ ఆలయ కుంభాభిషేకం పురస్కరించుకుని సోమవారం ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు సంప్రదాయపద్ధంగా పట్టువస్త్రాలు అందజేశారు. కనకదుర్గమ్మ ఆలయ ఈవో రామారావు స్వాగతం పలికి పట్టు వస్త్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, ఏఈఓ ధనపాల్, వేద పండితుల శివప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలోనే అభివృద్ధి



ఐఐటీ వద్ద సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఏర్పేడు, ఫిబ్రవరి 19: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపు మేరకు ఏర్పేడు మండలంలోని ఐఐటీ వద్ద గురవారెడ్డి ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విధ్వంసం, చంద్రబాబు పాలనలో అభివృద్ధిపై సెల్ఫీ చాలెంజ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఒక్క నూతన పరిశ్రమ రాక పోగా ఉన్న పరిశ్రమలను వైసీపీ ప్రభుత్వం వెళ్లగొట్టిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కృష్ణవేణి, మునెయ్య, రమణ, వెంకటస్వామి, సుధాకర్, చంద్రారెడ్డి, నిరంజన్, వెంటకరమణ, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి సేవలో ప్రముఖులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: ముక్కంటి ఆలయాన్ని త్రిపుర రాజ్యసభ సభ్యులు బిప్లబ్‌కుమార్ దేబ్, సినీనటి దేవయాని సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయండి



శ్రీకాళ హస్తి, ఫిబ్రవరి 19: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న ప్రసన్న వరద రాజస్వామి ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఈవో నాగేశ్వరరావు ఆదేశించారు. వరదరాజ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈఈ నూకరత్నమ్మ ఉన్నారు.







శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు ● సత్యవేడు, రేణిగుంట గాంధీ విగ్రహంవద్ద నిరసనలు

పత్రికా స్వేచ్ఛపై దాడి రాక్షసత్వం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: పత్రికా స్వేచ్ఛపై దాడిచేయడం రాక్షసత్వానికి నిదర్శనమని పలువురు జర్నలిస్టులు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వహించిన 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై కొందరు వైసీపీ మూకలు దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనను నిరసిస్తూ శ్రీకాళహస్తిలో ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండు చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి శరత్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు శంకరయ్య, ఎంవీ రమణ, వలిపి శ్రీరాములు, అంకయ్య, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కామేష్, ప్రధాన కార్యదర్శి చంద్ర, వివిధ పత్రికల పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యవేడు: రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ దాడి పిరికిపంద చర్య అని ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యుడు గుత్తి త్యాగరాజు విమర్శించారు. సత్యవేడులో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. స్థానిక క్లాక్ టవర్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని అక్కడ వినతిపత్రం సమర్పించారు. తర్వాత మళ్లీ ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు నివాళులర్పించి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. శ్రీకృష్ణపై దాడిచేసిన అల్లరి మూకలను అరెస్టు చేయాలని కోరారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామచంద్రయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు మునిప్రతాప్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పృథీరాజ్ వివిధ పత్రికల పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ● ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ ఖండించారు. రాప్తాడు ఘటనకు కారకులైన వైసీపీ దుండగులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పిచ్చాటూరు: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని పిచ్చాటూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఉమా శంకర్, కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

రేణిగుంట: రేణిగుంటలో పాత్రికేయులు స్థానిక గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహబుబ్‌భాష, కన్నారెడ్డి, నవాబ్‌జాన్, రవి, ఏలుమలైరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు, వివిధ పత్రికా విలేకరులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలో ప్రజా సంఘాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నిరసన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్, టీడీపీ నాయకులు నిర్మల్ తదితరులు ఎస్ఐ ప్రతాప్‌కు తహసీల్దారు ఉదయభారతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజు యాదవ్, సురేష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, హరిప్రసాద్ చౌదరి, దాముదాయల్, కుమార్, రమేష్‌రెడ్డి, ఎన్టీఆర్ వెంకయ్య, సీపీఐ మండల కార్యదర్శి తరుణ్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



వరదయ్యపాళెం తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

శ్రీసిటీ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

శ్రీసిటీ, ఫిబ్రవరి 19: శ్రీసిటీ డీఎస్పీగా జీవీఎస్ పైడేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా ఇక్కడి డీఎస్పీ జగదీష్ నాయక్ బాపట్లకు బదిలీ కాగా భీమవరం డీఎస్పీగా ఉన్న పైడేశ్వరరావు శ్రీసిటీకి వచ్చారు. ఎస్ఐ హరిప్రసాద్, శ్రీసిటీ సెక్యూరిటీ చీఫ్ రమేష్, ఇతర పోలీసు సిబ్బంది డీఎస్పీకి శాలువలు కప్పి, పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీసిటీలో మెడికవర్ క్లినిక్ ప్రారంభం



మెడికవర్ క్లినిక్ ప్రారంభిస్తున్న డీఎస్పీ పైడేశ్వరరావు

శ్రీసిటీ, ఫిబ్రవరి 19: నెల్లూరు మెడికవర్ ఆస్పత్రి వారి నూతన మెడికవర్ క్లినిక్ సోమవారం శ్రీసిటీలో ప్రారంభమైంది. స్థానిక షాపింగ్ ఆర్కేడ్‌లో ఏర్పాటు చేసిన క్లినిక్‌ను శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు ప్రారంభించారు. మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి, ఆంకాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ బిందు భార్గవ్‌రెడ్డి, మార్కెటింగ్ హెడ్ సతీష్ కుమార్, శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్లినిక్ పని చేస్తుందని మెడికవర్ మార్కెటింగ్ హెడ్ సతీష్ కుమార్ తెలిపారు. శ్రీసిటీ పరిధిలో ఆరోగ్య వైద్య సదుపాయాల్లో భాగంగా మరో క్లినిక్ ప్రారంభం కావడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

కోడి పందెం స్థావరాలపై దాడులు

తొట్టంబేడు, ఫిబ్రవరి 19: మండలంలోని రౌతుసూరమాల గ్రామం సమీపంలో కోడిపందెం స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2 కోళ్లు, రూ.4వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేశారు.

బీజేపీని ఆదరించండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ఆ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి పట్టణం మూడో వార్డు పరిధిలోని భాస్కర్‌పేటలో బీజేపీ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కోలా ఆనంద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ బాబు, అమర్నాథ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ నాయకులు మేరుం వినోద్‌కుమార్ అన్నారు. మేర్లపాక పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈగల బాలాజీరాయల్, మునస్వామిరెడ్డి, దామోదర్‌రాయల్, బాలగురవయ్య, భీమవరం సాయి కుమార్ రేవతిరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషిచేయండి



ఏర్పేడు, ఫిబ్రవరి 19: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. ఏర్పేడు మండలం మోదుగుల పాళెం గ్రామంలో సోమవారం 'ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, శివశంకర్‌రెడ్డి, పొన్నారావు, గురవారెడ్డి, నాగరాజు నాయుడు, మహేష్‌నాయుడు, చిరంజీవులు నాయుడు, సుబ్రహ్మణ్యం, చలపతినాయుడు, సుబ్ర హ్మణ్యం, మస్తాన్‌నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై సర్వే

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 19: వరదయ్యపాళెం మండలంలో రోడ్డు ఆక్రమణపై సోమవారం అధికారులు సర్వే నిర్వహించారు. మాజీ సర్పంచ్ చిన్న అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ వెంకటరమణ, ఆర్అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 19: మండలంలోని కాంబాకం పంచాయతీలో రామిరెడ్డిపాళెం ఎస్టీకాలనీలో కుష్టు వ్యాధిపై సోమవారం అవగాహన కల్పించారు. వైద్య శిబిరం ఏర్పాటుచేసి పరీక్షలు నిర్వహించి వ్యాధి సోకిన 8మందికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు లావణ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రభుత్వంతోనే వ్యాపారులకు స్వేచ్ఛ



ప్రచారం చేస్తున్న వినుత

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: ఉమ్మడి ప్రభుత్వంతోనే శ్రీకాళహస్తిలో వ్యాపారులకు స్వేచ్ఛ లభిస్తుందని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత అన్నారు. పట్టణంలోని చతుర్మాడ వీధుల్లో సోమవారం ఉమ్మడి మ్యానిఫెస్టోపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక శ్రీకాళహస్తిలో వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా గత మహాశివరాత్రి సమయంలో భూగర్భ విద్యుత్ లైను ఏర్పాటు పేరుతో రోడ్లను తవ్వేసి నెలలు తరబడి వ్యాపారులను ఇబ్బంది పెట్టారన్నారు. మళ్లీ ఈ ఏడాది సరిగ్గా మహాశివరాత్రికి విద్యుత్ స్తంభాల ఏర్పాటు పేరుతో మరోసారి రోడ్లను తవ్వేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పట్టాలను రద్దు చేయండి



ధర్నా చేస్తున్న మోరీస్ కండ్రిగ గ్రామస్తులు

కేవీబీపురం, ఫిబ్రవరి19: అక్రమంగా ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని మండలంలోని మోరీస్ కండ్రిగ గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం వారు తహసీల్దార్ కార్యాల యం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబరు 247/3పీలో గోపాలం నిమిత్తం 10 ఎకారాలు ఉండేదన్నారు. ఆ నేలను పశువుల మేతకు వినియోగించుకునేవారమన్నారు. 15 సంవత్సరాల క్రితం కొందరు కబ్జా చేయాలని చూశారన్నారు. అప్పట్లో అడ్డుకోవడంతో కబ్జాదారులు మిన్నకుండి పోయా రని గుర్తుచేశారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం మళ్లీ ఆ భూమిని చదును చేసేందుకు యత్నించారని వివరించారు. నిలదీస్తే పట్టాలు చూపుతున్నారని తెలియ జేశారు. రెవెన్యూ అధికారులు ఎలా పట్టాలు ఇస్తారని నిలదీశారు. ఆ భూమిని గ్రామా నికే చెందేలా చూడాలని కోరారు. అనంతరం సీపీఎం నాయకుడు జనార్ధన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీరాములనాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

మెరిట్ పరీక్షలో జితేంద్ర విష్ణు ప్రతిభ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: ఈఈఎంటీ అనే ఎన్జీవో సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ మెరిట్ పరీక్షలో శ్రీకాళహస్తికి చెందిన జితేంద్ర విష్ణు అనే విద్యార్థి జిల్లా మొదటి స్థానంలో నిలిచాడు. ఎడ్యుకేషనల్ ఏపిఫని అనే సంస్థ ఈ పరీక్ష నిర్వహించింది. ఇందులో శ్రీకాళహస్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జితేంద్ర విష్ణు పరీక్షలో సత్తా చాటాడు. ప్రశంసాపత్రంతో పాటు రూ.8వేల నగదు అవార్డును విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ చేతుల మీదుగా విజయ వాడలో అందుకున్నాడు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు జితేంద్రవిష్ణును అభినందించారు.

పేకాట శిబిరంపై దాడి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 19: చెన్నావారిపాళెం సమీపంలోని పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2,370 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ప్రతాప్ కేసు నమోదు చేశారు.

24న త్రిశూల స్నానం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: ఈ నెల 24వ తేదీన ముక్కంటి ఆలయం వద్ద స్వర్ణ ముఖి నదిలో త్రిశూల స్నానం నిర్వహిం చనున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు ముందు వచ్చే వ్యాస పూర్ణిమ పురస్క రించుకొని ఈ విశేష ఉత్సవం నిర్వహిం చనున్నారు. 25వ తేదీ దోపు ఉత్సవం జరుగుతుంది.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న జనార్దన్ రావు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: అబాకస్ పోటీల్లో ది స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆదివారం తిరుపతిలో విశ్వం ఎడ్యుకేట్ హైదరాబాద్ సంస్థ అబాకస్ పోటీలు నిర్వహించింది. ఇందులో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన ది స్కూల్ విద్యార్థులు సఫియా, కోమలాదిత్య, స్టీఫెన్ అషర్ ప్రతిభ చూపి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ మేరకు సోమవారం విద్యార్థులను కరస్పాండెంట్ జనార్దన్ రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విశాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

తొట్టంబేడు, ఫిబ్రవరి 19: మండలంలోని చిట్టత్తూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు వేణురెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బొజ్జల బృందమ్మ వారి ఇంటికి సోమవారం వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రావిళ్లమునిరాజ నాయుడు, బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

తొట్టంబేడు, ఫిబ్రవరి 19: బొజ్జల కుటుంబం చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని టీడీపీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి కోరారు. శ్రీకాళహస్తి మండలంలోని ఈంద్రపల్లి, వాగివేడు, గంగులపూడి గ్రామాలలో సోమవారం ఆమె పర్యటించారు. టీడీపీని గెలిపిం చాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటిపర్తి రవీంద్ర నాథ్‌రెడ్డి, రంగినేని చంచయ్యనాయుడు, తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, పాపిరెడ్డి, బత్తిరెడ్డి, హరి, పవన్, క్రిష్టాయాదవ్, జగదీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెప్పల తయారీని వేగవంతం చేయండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యేలా తెప్పల తయారీని వేగవంతం చేయాలని ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆదేశించారు. ముక్కంటి ఆలయంలో రూ.27 లక్షల వ్యయంతో తయారు చేస్తున్న స్వామి అమ్మవార్ల తెప్పలను సోమవారం ఆయన పరిశీలించారు.

నేడు భీష్మ ఏకాదశి ఉత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: ముక్కంటి ఆలయంలో మంగళవారం భీష్మ ఏకాదశి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక పూజలు, నగరోత్సవం చేపట్టనున్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపైకి దూసుకెళ్లిన లారీ..ఒకరి మృతి

రేణిగుంట, ఫిబ్రవరి19: నిద్రిస్తున్న వ్యక్తిపైకి లారీ ఎక్కేయడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన స్థానిక రమణావిలాస్ చెక్‌పోస్ట్ సమీపంలో సోమవారం జరిగింది. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు.. కడప వైపు వెళ్లేందుకు ఓ లారీ చెక్‌పోస్టు వద్ద ఆగింది. డ్రైవర్ భోజనానికి వెళ్లాడు. ఆ సమయంలో నాగలాపురం ప్రాంతానికి చెందిన కేఎం నరేష్ (39) ఆ లారీ కింద నిద్రపోయాడు. కొంతసేపటి తర్వాత వచ్చిన డ్రైవర్ లారీని నడపడంతో లారీ కింద నిద్రిస్తున్న వ్యక్తిపైకి వెనుక చక్రాలు ఎక్కేశాయి. గాయపడిన నరేష్‌ను 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు జాబితాను జల్లెడ పట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: శ్రీకాళహస్తిలో ఓటరు జాబితాను క్షుణ్ణంగా జల్లెడ పట్టాలని టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పోలింగ్ బూత్ ఏజెంట్లు, క్లస్టర్ ఇన్ చార్జిలు, యూనిట్ సభ్యులకు ఓటర్ జాబితా వెరిఫికేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి డబుల్ ఎంట్రీలు, మృతుల ఓట్లు, దొంగ ఓట్లు గుర్తించాలన్నారు. ఇక రాబిన్ శర్మ బృందం సభ్యులు మాట్లాడుతూ జాబితా వెరిఫికేషన్‌పై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై వైసీపీ పైశాచిక దాడి



విలేకరుల సమావేశంలో మట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: పైశాచికత్వం నిండిన వైసీపీ శ్రేణులు ప్రజాస్వామ్య వ్యవస్థలపై దాడులు చేస్తున్నాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి విమర్శించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ నాయకులు చేసిన దాడిని సోమవారం విలేకరుల సమావేశంలో ఖండిచారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల రవి, తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్ రావు, తిరుపతి పార్లమెంటు కార్యదర్శి భాస్కర్‌గౌడ్, డిల్లీబాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, రామచంద్రయ్య, బీమాల భాస్కర్ ముదిరాజ్, మణి, చింత గింజల సునీల్ తదితరులు పాల్గొన్నారు.